క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

- జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్





# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 31 మార్చి-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


ముంచుకొస్తున్న

## మంచినీటి సమస్య !



- కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ మిగతా 2లో..

- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం

# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

హైదరాబాద్, మార్చి 30: ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. మిగతా 3లో..



## నగరంలో మరోమారు డ్రగ్స్ కలకలం

మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్

మిగతా 2లో..

## అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు



- సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్
- బిల్లును వ్యతిరేకించిన బిజెపి

3లో..

## ఉద్యకారులు లేకుంటే మనమంతా లేనట్లే



- సిఎం, మంత్రులు కూడా ఉండేవారా?
- వారికిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- మండలిలో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు 3లో..

రాఘువ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై

## మండలిలో ఆందోళన

- మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్
- ఒకరోజు బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్
- శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి



హైదరాబాద్, మార్చి 30: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఒక్క రోజు సమావేశాలకుహాజరుకాకుండా బహిష్కరిస్తున్నట్లుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసింది. అసెంబ్లీ సెషన్ ముగిసేవరకూ సమావేశాలకు హాజరు కాకుండా బహిష్కరించింది. దీంతో పొంగులేటి కంపెనీ అవినీతిపై మండలిలో బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. పొంగులేటిని మంత్రి పదవి

## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

హైదరాబాద్, మార్చి 30: జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు.



స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితు లకు న్యాయం చేస్తామని మిగతా 3లో..

## చర్చల ద్వారా సమస్యల పరిష్కారం



- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిపిన మావోయిస్టులు
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన మిగతా 3లో..

## చైనా సిసి కెమెరాల బ్యాన్

- బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం
- కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం 3లో..




## పొంగులేటిని బర్తరఫ్ చేయండి



- గవర్నర్‌కు బిఆర్ఎస్ విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 30: ప్రతిపక్షాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. లోక్ భవన్‌కు వెళ్లిన బీఆర్ఎస్ బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. మిగతా 3లో..

## సడలని పశ్చిమాసియా ఉద్రక్తలు

- భారీగా నష్టపోయిన సూచీలు




న్యూఢిల్లీ, మార్చి 30: పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత ముదర వచ్చున్న భయాల నడుమ సోమవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాలను మూట గట్టుకున్నాయి. సెన్సెక్స్ 1635.67 పాయింట్ల మేర పత నమై 71,947.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 488.20 పాయింట్ల మేర తగ్గి 22,331.40 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా 2.6 శాతం మేర పతనమయ్యాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, టెలికం, రియల్టీ, ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు నేడు 2-4 శాతం మేర నష్టాలను మూటగట్టుకున్నాయి. నేటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒకానొక దశలో 95.12 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి తాకింది. చివర్లో కాస్త కోలుకుని 94.83 డాలర్ల వద్ద ముగిసింది. చమురు ధరలు మళ్లీ ఆకాశాన్నంటడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. కొన్ని రోజుల క్రితం 100 డాలర్ మార్కు దిగువకు చేరిన బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర ప్రస్తుతం 115 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో క్రూడ్ ఆయిల్ ధర 120 డాలర్లకు చేరవచ్చనే అంచనాలు కూడా మార్కెట్ వర్గాలను కలవరపెడుతున్నాయి.

## పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, మార్చి 30: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు'పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది



కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు.

## అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



నారాయణపేట,మార్చి30 : నారాయణపేట జిల్లా కృష్ణఖన మండలం గుడేబడ్లూరులో విషాదం నెలకొంది. అప్పుల బాధతో కృష్ణా నదిలో దూకి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గుడేబడ్లూరు టై రోడ్డు చెక్‌పోస్టు వద్ద నివాసం ఉండే నాగరాజు (55) కృష్ణా పరివాహక ప్రాంతంలో భూమి కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత రెండేళ్లుగా ఆశించినంతగా వరి పంట దిగుబడి రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో నిరాశకు లోనైన నాగరాజు.. ఈ సీజన్‌లో పంట వేయలేదు. సాగు కోసం చేసిన అప్పుల తీర్చేందుకు, పొట్ట కూటి కోసం హైదరాబాద్ వచ్చాడు. హైదరాబాద్‌లో చిన్నా చితకా పనిచేస్తున్న నాగరాజు.. రెండు రోజుల క్రితం భార్యాపిల్లలను చూసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారు జామున 4 గంటలకు కృష్ణ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పుల బాధ భరించలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజు భార్య పోలీసులకు తెలిపింది. కౌలు రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని స్థానికులు డిమాండ్ చేశారు.

## నల్లగొండలో ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



నల్లగొండ,మార్చి30 : టీజీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ డిపో జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యుత్ బస్సుల విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ కార్మికులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గో బ్యాక్ గోబ్యాక్ ఈవీ బస్సులు గో బ్యాక్.. ఆర్టీసీ స్థలాల్లో– ఆర్టీసీ బస్సులే ఉండాలి.. ఆర్టీసీ బస్సులే ఉండాలి– ఆర్టీసీ సిబ్బందే నడపాలి.. ఆర్టీసీ స్థలాల నుండి– ప్రైవేట్ ఈవీ బస్సులు వెళ్లగొట్టాలే అంటూ నినాదాలు చేశా రు. ప్రభుత్వమే ఈవీ బస్సులని కొనుగోలు చేసి ఆర్టీసీలకు ఇవ్వా లని, ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేట్ ఈవీ బస్సులను తీసుకుని, పూర్తిగా ప్రైవేట్ వారికి అప్పగించి, కొత్త నియామకాలు చేపట్టకుండా పూర్తి గా సంస్థను నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను, మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల పట్ల రాష్ట్ర జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిందని, ఇక ముందు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని పోరాటాల్లో పాల్గొని విజయవంతం చేసి అన్నింటిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు బి.నరేందర్, బాసాని వెంకటయ్య, జిల్లా జేఏసీ నాయకులు ఎన్ఆర్సీ రాజు, టీజే రావు, డిపో జేఏసీ నాయకులు ఏఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జీతాల కోసం ఆశావర్కర్ల ధర్నా

- జాతీయరహదారిపై బైఠాయింపు
- ఎక్కడిక్కడే నిలిచి పోయిన వాహనాలు



మహబూబ్‌నగర్,మార్చి30 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆశావర్కర్లు జడ్చర్ల సమీపంలోని కావరమ్మపేట జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వందలాది మంది మహిళలు రోడ్డుపై బైఠాయించారు.ధర్నా వల్ల హైదరాబాద్ ,కర్నూలు జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా ఎక్కడికక్కడే నిలిచి పోయాయి . జీతాలు ఇవ్వాలని, సీఎం డౌన్ డౌన్ అంటూ ఆశా వర్కర్లు నినాదాలు చేశారు. జీతాలు లేక కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని, పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆశా వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించడం లేదని, వెట్టి చాకిరీ చేయించుకుంటూ వేతనాలు నిలిపి వే యడం దారుణమని అన్నారు. ధర్నాను విరమించాలని పోలీసులు బలగాలు కోరగా ససేమిరా అనడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆశావర్కర్లను అక్కడి నుంచి తొలగించేం దుకు నానా అవస్థలు పడ్డారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. అధికారులు రాతపూర్వక హామీ ఇచ్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

## 30వేలు లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ

### ఎసిబి అధికారులు దాడి చేసి పట్టివేత

నాగర్‌కర్నూల్,మార్చి30 : తిమ్మాజిపేట మండల ఎస్సై ఏసీబీకి పట్టుబడ్డారు. ఒక కేసుకు సంబంధించి ఒక వ్యక్తి నుంచి రూ. 30 వేలు లంచం ఎస్సై డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఇసుక సరఫరా చేస్తున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జేసీబీని పట్టుకొని ఈనెల 5న ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వివరాలను నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ. 60 వేలు ఫైన్ వేశారు. ఈ డబ్బులను ఈనెల 7వ తేదీన చెల్లించి వాహనాల రిలీజ్ కోసం పత్రాలను తెచ్చి ఎస్సైకి అందజేశాడు. అయితే ఎస్సై రూ. 30 వేలు ఇస్తేనే వాహనాలను విడుదల చేస్తామని డిమాండ్ చేశారు. మైనింగ్ ఫైన్ కట్టడంతో పాటు, మళ్లీ రూ. 30 వేలు కట్టవలసి రావడంతో వాయిస్ రికార్డింగ్‌లు, రూ. 20వేలు చెల్లించిన అంశాలతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అన్ని ఆధారాలతో ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

- కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ







హైదరాబాద్, మార్చి 30: సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహే శ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు.. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

## అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

- హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే
- శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



హైదరాబాద్, మార్చి 30: రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆర్ఎస్ శాసన సభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటు న్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శాసనమండలి..కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరే కంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగలేటి శ్రీని వాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు.

## అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

### సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్

### బిల్లును వ్యతిరేకించిన బిజెపి




హైదరాబాద్, మార్చి 30:తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన జరిమానాలు, 7 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధించడం, ఈ నేరాలను నాన్–బెయిలబుల్‌గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతో పాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు.ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్గం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు! అయితే హేట్ స్పీచ్ బిల్లు అత్యంత ప్రమాదకరమని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని.. చర్చ సాగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని.. హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలియజేశారు.

## సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

### అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్



హైదరాబాద్, మార్చి 30: సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాళ్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్.. సన్నబియ్యం ఆలోచన రేవంత్ రెడ్డిదేనన్నారు. రూ. 14560 కోట్లు సన్నబియ్యం కోసం ఖర్చు చేశామని చెప్పారు.ఇపుడు పేదలు కడుపు నిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది జనాలకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామన్నారు. ఎంత ఖర్చైనా సన్నబియ్యం పథకం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల ఖాతాలో ఇప్పటి వరకు రూ. 40 వేల కోట్లు వేశామ న్నారు ఉత్తమ్. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతులకువేస్తున్నామని తెలిపారు.అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు.

## క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

### జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్



హైదరాబాద్, మార్చి 30: క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ఆయన లోక్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనంలోని సౌకర్యాలను ఎంపీ రఘునందన్ రావు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రిలో ఉండే స్క్రీనింగ్ సౌకర్యాలు ఇందులో ఉన్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారం భ దశలోనేగుర్తిస్తే.. తగిన చికిత్స ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు.

## న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు

### అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, మార్చి 30: న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకొస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభలో వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. పట్టపగలే వారిని హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ప్రోద్భలంతోనే వారు హత్యకు గురైనట్లు ఆక్షేపించారు. అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండాఉండేందుకేఈబిల్లు తీసుకొస్తున్నట్లు చెప్పారు.

## ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెం టనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యా యులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.

## పొంగులేటిని బర్తరఫ్ చేయండి

ఆదివారం కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మంత్రి పొంగులేటి రాఘవ కన్ స్ట్రక్షన్ ద్వారా అక్రమ మైనింగ్?కు పాల్పడుతూ ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్‌పై వ్యవహారాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో గత పదేండ్ల కాలంలో జరిగిన ప్రతి అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయిలో సీబీ సీ–ఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్టు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## మండలిలో ఆందోళన

నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అవినీతిపై సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా మండలి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇలా మండలి సభ్యులపై సస్పెన్షన్ వేటు పడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, సస్పెన్షన్‌కు నిరసగా బీఆర్ఎస్ మండలి సభ్యులు చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో మండలి సభ్యులను మార్షల్స్ బలవంతంగా లాక్కెళ్లారు. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాని.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. ఛైర్మన్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ అంశంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభలో సీఎం రేవంత్ స్పష్టం చేశారని చెప్పారు. సభ సజావుగా సాగేందుకు బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని కోరారు. మరోవైపు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా సభా కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలని పదే పదే కోరారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన కొనసాగించడంతో వారిని సస్పెండ్ చేయాలని మంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు.

# చైనా సిసి కెమెరాల బ్యాన్

- బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం
- కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం



హైదరాబాద్, మార్చి 30: చైనీస్ సీసీటీవీ కెమెరాలను నిషేధిస్తూ భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మేడ్ ఇన్ చైనా' కెమెరాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించబోతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో హెక్ విషన్ , దాహువా, టీపీ-లింక్ వంటి చైనా కంపెనీల హవా నడుస్తోంది. అయితే.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం.. ఇంటర్నెట్‌తో అనుసంధాన మయ్యే ఈ చైనా కంపెనీల నిఘా పరికరాల అమ్మకాలను భారత్‌లో నిలిపివేయనున్నారు. ముఖ్యంగా 'స్టాండర్డంల్గ÷జేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్' అనుమతి ఉన్న కెమెరాలను మాత్రమే ఇకపై దేశంలో విక్రయించాల్సి ఉంటుంది. నిఘా పరికరాలు అత్యంత సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తాయి. విమానాశ్రయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు వంటి కీలక ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో చైనా కెమెరాల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కెమెరాల్లో రహస్యంగా 'బ్యాక్ డోర్' యాక్సెస్ ఉండే అవకాశం ఉందని, దీని ద్వారా సేకరించిన సమాచారం విదేశీ సర్వర్‌లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చైనా కెమెరాలను వాడటం వల్ల మన వ్యూహాత్మక సమాచారం బయటకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సర్వైలెన్స్ మార్కెట్‌లలో ఒకటి. తాజా నిర్ణయం వల్ల చైనా కంపెనీలకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉండగా.. భారతీయ తయారీదారులకు ఇది పెద్ద అవకాశంగా మారనుంది. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరగనుంది. మొత్తానికి.. డేటా భద్రతే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం టెక్నాలజీ , రక్షణ రంగాల్లో పెను మార్పులకు దారితీయనుంది.

# చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిడిపిన మావోయిస్టులు
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన



న్యూఢిల్లీ,మార్చి30 : చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుం టున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఏ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

# ఉద్యకారులు లేకుంటే మనమంతా లేనట్లే

- సిఎం, మంత్రులు కూడా ఉండేవారా?
- వారికిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- మండలిలో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 30: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విజజప్తి చేశారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ విజయ శాంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోయినా.. ఇంకా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు సైతం అమలు కాలేదన్నారు. ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి గుర్తుచేశారు. ఆయా కుటుంబాలకు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ సైతం ఇచ్చామని ప్రభుత్వానికి వివరించారు. ఉద్యమకారులకు మనం తొలి ప్రాధాన్యం ఇస్తామని భరోసా కూడా ఇచ్చామని ఎమ్మెల్సీ విజయశాంతి తెలిపారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉద్యమకారులు తమను ప్రశ్నిస్తున్నారని శాసనమండలి వేదికగా ఎమ్మెల్సీ విజయశాంతి వివరించారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తి వేసి జూన్ 2వ తేదీ నాటికి వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చామని.. అది కూడా ఇంకా నెరవేరలేదని విజయశాంతి చెప్పారు. ఉద్యమకారులు లేకపోతే సీఎంలు, మంత్రులు ఉండేవారా? అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఆ బాధ్యతను కాంగ్రెస్ నెరవేరిస్తే మరో చరిత్ర అవుతుందని.. పట్టించుకోకుంటే చారిత్రక తప్పిదం అవుతుందని విజయశాంతి పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి సూచించారు

# కాళేశ్వరంతో లక్షకోట్లు ప్రజాధనం వృధా

- రాజ్యసభలో కేంద్రమంత్రి పాటిల్ వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 30: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ సోమవారం రాజ్యసభలో సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ. లక్షల కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలంటూ రాజ్యసభలో కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ పైవిధంగా స్పందించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటుపై ఎన్డీఎస్ఏ నివేదికను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ నిధుల వినియోగంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రమంత్రి సి.ఆర్.పాటిల్ ధ్వజమెత్తారు. రాష్ట్రం వద్ద రూ.873 కోట్లు ఉన్నా.. మూడేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.194 కోట్లేనని ఆయన గుర్తు చేశారు. మూడేళ్లుగా ఒక్క కొత్త స్కీమ్ ప్రతిపాదన కూడా తెలంగాణ ప్రభుత్వం నుంచి రాలేదని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ పెదవి విరిచారు. మరోవైపు తెలంగాణకు చెందిన రాజ్యసభ్య సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ చే విచారణ జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

## చిత్తశుద్ధి ఉంటే ఓవైసీపై చర్య తీసుకోండి

- బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్



హైదరాబాద్, మార్చి 30: హేట్ స్పీచ్ బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే, మొదట తెలంగాణ ప్రభుత్వం.. అక్బరుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రాజ్యసభలో ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావనకు తీసుకువస్తే కాంగ్రెస్ సహా విపక్షాలు అడ్డు కున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్, అన్ని విపక్షాలు ఏకమై తన గొంతు నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఓబీసీల్లో ముస్లింలను మూకుమ్మడిగా చేరుస్తున్నారని.. ఓబీసీలు వెనకపడటానికి కారణమవుతున్నారని ఆరోపించారు. ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ అన్నారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో సహా అందరూ అడ్డుకున్నారని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని కులంగా గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చిందని... 4 శాతంరిజర్వేషన్‌ఇచ్చినట్లు ఎంపీ చెప్పారు. బెంగాల్, తమిళనాడు, కేరళ, తెలంగాణలోనూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. పోటీ పడి ఒక వర్గం ఓట్ల కోసం కక్కుర్తి పడుతున్నారని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల స్థానాల్లో ముస్లింలే పోటీ చేశారన్నారు.

## లాకర్ వస్తువులకు బీమా సౌకర్యం కుదరదు

### అందులో ఏం దాచారో బ్యాంకులు చూడవు

### లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ,మార్చి30 : బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ కుదరదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. లాకర్లలో దాచిన వస్తువులను బ్యాంకు అధికారులు చూడరని, వాటిని రికార్డు చేయరని స్పష్టం చేశారు. కాబట్టి విలువ ఆధారంగా బీమా కవరేజీ అందించడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తగా ఆర్థిక మంత్రి దీనిపై స్పందించారు. 'లాకర్లలోని వస్తువులను బ్యాంకు సిబ్బంది తనిఖీ చేయలేరు. అలా చేయడం బ్యాంకు రూల్స్‌కి విరుద్ధం. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయి. లాకర్ వార్షిక అ÷–దదెకు 100 రెట్లు పరిహారం చెల్లిస్తున్నాయి' అని ఆమె గుర్తుచేశారు. లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీలు చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం అందించడం సాధ్యంకాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని మంత్రి తెలిపారు.

## ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

### త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి

### మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

వాషింగ్టన్,మార్చి30 : ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ఎలాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం' అని హెచ్చరించారు.

## అత్తాపూర్‌లో దారుణ ఘటన

### మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

హైదరాబాద్,మార్చి30 : హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఒక దారుణ ఘటన ఇప్పుడు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తోంది. కనీసం తనపై జరుగుతున్న దాడిని కూడా అర్థం చేసుకోలేని, తన గోడును ఎవరికీ చెప్పుకోలేని ఒక మతిస్థిమితం లేని యువతిపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్ నగర్‌లోని మతిస్థిమితం సరిగ్గా లేని ఒక యువతిపై ఈ అఘాయిత్యం జరిగింది. యువతి ఒంటరిగా ఉన్నది గమనించిన ఒక యువకుడు ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడ నుంచి పారిపోయాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు యువతి పరిస్థితి గమనించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిదింతుడు అదే ప్రాంతానికి చెందిన అఖిల్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల కోసం యువతిని ఆస్పత్రికి తరలించారు.

## నగరంలో మరోమారు డ్రగ్స్ కలకలం

### మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్




హైదరాబాద్,మార్చి30 : హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. మోకిలలో డ్రగ్స్ విక్రయిస్తున్న డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి రైల్వేశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి.. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా రైల్వే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గూగుల్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పాటూ మరో వ్యాపారవేత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు.

## పోస్టు-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడిగింపు..




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ/ ఎస్టి / బిసి/ ఈ బీసీ దివ్యాంగులు మరియు మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడిగించబడినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డా. వి. రవీందర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డా. వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ దరఖాస్తులను http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా 20 ఏప్రిల్ 2026 లోగా సమర్పించవచ్చని, జిల్లా అధికారులు, సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ మరియు యాజమాన్యాలను తమ విద్యార్థుల స్కాలర్‌షిప్ దరఖాస్తులను వేగవంతంగా ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## విశాఖలో దారుణ హత్య..

- ప్రియురాలిని చంపి ముక్కలుగా చేసి ఫ్రిడ్జిలో దాచిన వ్యక్తి..



**బలగం టీవీ, విశాఖపట్నం:**
విశాఖపట్నం జిల్లాలో సంచలనం రేపిన ఘోర ఘటన చోటుచేసుకుంది. గాజువాక పరిధిలోని ఎల్‌వీ నగర్ ప్రాంతంలో నివసిస్తున్న నేవీ ఉద్యోగి రవీంద్ర తన ప్రియురాలు మౌనిక (28)ను హత్య చేసి ముక్కలుగా కోసి ఫ్రిడ్జ్‌లో దాచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం, రవీంద్రకు ఇప్పటికే వివాహం కాగా, మౌనిక అనే వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లు సమాచారం. ఇటీవల మౌనిక డబ్బుల కోసం రవీంద్రను వేధిస్తుండటంతో, ఈ ఇద్దరి మధ్య వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో, రవీంద్ర భార్య పుట్టింటికి వెళ్లిన సమయంలో మౌనికను తన ఇంటికి పిలిచాడు. అక్కడ ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకోగా, ఆవేశంలో రవీంద్ర కత్తితో మౌనికను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా కోసి, కొంత భాగాన్ని ఫ్రిడ్జ్‌లో ఉంచి, మిగతా భాగాన్ని మూట కట్టి ఇంట్లోనే దాచినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం రవీంద్ర స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. డబ్బుల కోసం మౌనిక వేధించడమే ఈ హత్యకు కారణమని తన వాగ్మూలంలో పేర్కొన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే మృతదేహంలోని తల భాగం కనిపించకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## నేడు సిరిసిల్ల మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో రేపు, మార్చి 31వ తేదీన (మంగళవారం) 2026-2027 సంవత్సరానికి ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు. మున్సిపల్ కమిషనర్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఉదయం 11:00 గంటలకు ప్రత్యేక బడ్జెట్ సమావేశం ప్రారంభమవుతుంది. అనంతరం మధ్యాహ్నం 1:30 గంటలకు పురపాలక సంఘ సాధారణ కౌన్సిల్ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశాల్లో మున్సిపాలిటీకి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, బడ్జెట్ కేటాయింపులపై చర్చ జరగనుంది. కౌన్సిల్ సమావేశాల ముగింపు తర్వాత, మున్సిపల్ చైర్‌పర్సన్ మీడియా ప్రతినిధులతో తమ ఛాంబర్‌లో సమావేశమై, సమావేశంలో చర్చించిన ప్రధానాంశాలు, బడ్జెట్ వివరాలను వివరించనున్నారు.



## ఘనంగా గరుడోత్సవం- అంగరంగ వైభవంగా రథయాత్ర..

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఆదివారం గరుడోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన ఈ వేడుకల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడవాహనంపై ఊరేగించారు. గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా రథయాత్ర కొనసాగింది. ఉదయం ఆలయ అర్చకులు హోమం, బలిహరణం నిర్వహించి రథబలి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన భక్తులకు నిమ్మ లక్ష్మి నారాయణ రెడ్డి దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్ మోతే లక్ష్మారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్కే సాబేరా బేగం, వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు షేక్ గౌస్, మండే శ్రీనివాస్, లద్దునూరి హనుమాన్లు, నల్ల పరుశురాములు, నిమ్మ సుధాకర్ రెడ్డి, సిరిపురం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ధర్మ టీచర్స్ యూనిటీ క్యాలెండర్ ఆవిష్కరణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ధర్మ టీచర్స్ యూనిటీ క్యాలెండర్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే ని ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చెయ్యాలని అన్నారు. ధర్మ టీచర్స్ యూనిటీ జిల్లా కన్వీనర్ సంపతి రమేష్ మాట్లాడుతూ, "విద్యను ప్రజాస్వామీకరించాలనే నినాదంతో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా రెండు సంవత్సరాల క్రితం ధర్మ టీచర్స్ యూనిటీ ఆవిర్భవించిందని, దీన్ని ఉపాధ్యాయ లోకం ఆదరించాలని కోరారు. "జిల్లా కో-కన్వీనర్ గొట్టిముక్కుల శేఖర్ మాట్లాడుతూ.. ఈ సంఘం విద్యాభివృద్ధికి కృషి చేయడమే కాకుండా పాఠశాలల్లోని సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి కూడా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ టీచర్స్ యూనిటీ సలహాదారు మారంపల్లి రాజయ్య, కో-కన్వీనర్ మల్యాల రామస్వామి మరియు అశోక్ లు పాల్గొన్నారు.

# చైనా సిసి కెమెరాల బ్యాన్

- బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం
- కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం

**బలగం టీవి, న్యూఢిల్లీ**
చైనీస్ సీసీటీవీ కెమెరాలను నిషేధిస్తూ భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మేడ్ ఇన్ చైనా' కెమెరాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించబోతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో హెక్ విషన్ , దాహువా, టీపీ-లింక్ వంటి చైనా కంపెనీల హవా నడుస్తోంది. అయితే.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం.. ఇంటర్నెట్‌తో అనుసంధాన మయ్యే ఈ చైనా కంపెనీల నిఘా పరికరాల అమ్మకాలను భారత్‌లో నిలిపివేయనున్నారు. ముఖ్యంగా 'స్టాండ్డంల్గక్మిజేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్' అనుమతి ఉన్న కెమెరాలను మాత్రమే ఇకపై దేశంలో విక్రయించాల్సి ఉంటుంది. నిఘా పరికరాలు అత్యంత సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తాయి. విమానాశ్రయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు వంటి కీలక ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో చైనా కెమెరాల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కెమెరాల్లో రహస్యంగా 'బ్యాక్ డోర్' యాక్సెస్ ఉండే అవకాశం ఉందని, దీని ద్వారా సేకరించిన సమాచారం విదేశీ సర్వర్లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చైనా కెమెరాలను వాడటం వల్ల మన వ్యూహాత్మక సమాచారం బయటకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సర్వైలెన్స్ మార్కెట్‌లలో ఒకటి. తాజా నిర్ణయం వల్ల చైనా కంపెనీలకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉండగా.. భారతీయ తయారీదారులకు ఇది పెద్ద అవకాశంగా మారనుంది. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరగనుంది. మొత్తానికి.. డేటా భద్రతే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం టెక్నాలజీ , రక్షణ రంగాల్లో పెను మార్పులకు దారితీయనుంది.

# కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని రక్షించడానికే ఈవీ

- 10-20 శాతం డిస్కౌంట్ తో ఈవీ వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం ఉద్యోగుల నుంచి మంచి స్పందన
- ఈవీ వాహనాల ప్రోత్సాహకానికి ముందుకు వచ్చిన టాటా, మహీంద్రా ఎలక్ట్రిక్స్, గ్రావిటన్ ఓలా , ఏథర్ ఎనర్జీ
- ఈవీ వాహనాల ప్రోత్సాహానికి మరిన్ని కంపెనీలు ముందుకు రావాలి..
- మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, హైదరాబాద్:**
రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించడానికే రాష్ట్ర ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకొచ్చింది.ఇప్పటి వరకు లక్షా 15 వేల 551 వాహనాలకు వంద శాతం రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు చేసి దాదాపు వేయి కోట్ల మేర పన్ను మినహాయింపు ఇవ్వడం జరిగింది. ఫలితంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం 0.60 -- 1.50% కి పెరిగింది. అయితే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడానికి రవాణా శాఖ ఫలుదఫలుగా ఈవీ తయారీ కంపెనీల తో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు 10-20 డిస్కౌంట్ ఇచ్చేలా వారిని ఒప్పించింది. దీని ద్వారా ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకొస్తే దానికి ప్రభుత్వ ఉద్యోగులు బ్రాండ్ అబాసిడర్ గా మారి వాహనాల వినియోగాన్ని పెంచడానికి కృషి చేస్తున్నారు. ఈనెల 24 వ తేదీన సచివాయం వేదికగా సిఎస్ రామకృష్ణ రావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉద్యోగ సంఘాలతో కలిసి ఉద్యోగులకు ఈవీ వాహనాల్లో డిస్కౌంట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఫలితంగా గ్రామీణ స్థాయి నుండి రాజధాని వరకు ఉద్యోగుల నుండి మంచి స్పందన వస్తుంది.ద్విచక్ర, నాలుగు చక్రాల వాహన విభాగాలలో ప్రముఖ ఈవీ (జుఎ) తయారీదారులతో భాగస్వామ్యాల ద్వారా, తమ ఉద్యోగులలో ఎలక్ట్రిక్ మొబిలిటీ వినియోగాన్ని వేగవంతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం వ్యూహాత్మక కార్యక్రమం ద్వారా సుస్థిర రవాణాను ప్రోత్సహించడానికి మరియు సంప్రదాయ ఇంధ నాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి రాష్ట్రం చేస్తున్న విస్తృత ప్రయత్నాలలో ఈవి వాహనాల పై డిస్కంట్ ఒక కార్యక్రమం.

"తెలంగాణ కేవలం ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడమే కాదు దేశంలో ఈవి లో అగ్రగామిగా నిలుస్తుంది.మన ప్రభుత్వ ఉద్యోగులనే ఈవీలను స్వీకరించేలా చేయడం ద్వారా, సుస్థిర రవాణా ఆచరణాత్మకమైనదని, సరసమైనదని మరియు భవిష్యత్తుకు సరైన మార్గమని మేము నిరూపిస్తున్నాము.రాష్ట్ర ఈవీ



విధానం ఎలక్ట్రిక్ వాహనాలకు 100% రోడ్డు పన్ను మరియు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు,తయారీదారులకు మూలధన రాయితీలు, మరియు ఈవీ విడిభాగాలు, బ్యాటరీ ఎకోసిస్టమ్ భాగస్వాములను పెంచుతుంది.దీనికి సమాంతరంగా, తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థల ద్వారా భారీ స్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం, పట్టణ కేంద్రాలు, జాతీయ రహదారులు మరియు వాణిజ్య కేంద్రాలలో ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కోసం అనుకూల విధానాలను తీసుకురావడం ద్వారా ప్రజా రవాణా విద్యుదీకరణపై దృష్టి సారించింది. ఈవీ తయారీ ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తూనే, ప్రోత్సాహకాలు మరియు విధానపరమైన మద్దతు ద్వారా ఫ్లీట్ ఆపరేటర్లు, అగ్రిగేటర్లు మరియు లాస్ట్-మైల్ మొబిలిటీ ప్రొవైడర్లను ఈవీలకు మారేలా ప్రభుత్వం ప్రోత్సహించింది.

టాటా మోటార్స్ లో టియాగో ఈవీ 10 % , కర్వ్ ఈవీ 21%,పంచ్ ఈవీ 20%, గ్రావిటన్ ఆల్ మోడల్స్ 10-20% వరకు , అథార్ ఎనర్జీ 15% వరకు ,మహీంద్రా ఎలక్ట్రిక్స్, ఓలా ఎలక్ట్రిక్స్ 20 % వరకు అవకాశాన్ని కల్పించింది..

తెలంగాణ వినూత్న ప్రోత్సాహక పథకాల ద్వారా డిమాండ్ వైపు స్వీకరణను చురుకుగా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు గ్రావ్‌టన్ మోటార్స్ మరియు ఏథర్ ఎనర్జీకి చెందిన ఎలక్ట్రిక్ టూ-వీలర్లపై, అలాగే టాటా మోటార్స్ మరియు మహీంద్రా ఢ మహీంద్రాకు చెందిన ఎలక్ట్రిక్ కార్లపై 10- 20% వరకు రాయితీలు అందిస్తోంది. ఈ కార్యక్రమాలు ప్రభుత్వ ఉద్యోగులను తొలి వినియోగదారులుగా మరియు స్వచ్ఛమైన రవాణాకు రాయబారులుగా తీర్చిదిద్దేందుకు రూపొందించబడ్డాయి. ఇందుకోసం మరిన్ని ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీలు ముందుకు రావాలని కోరుతున్న.ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వైపు చురుకుగా రావాలి.దీనికి తోడుగా, సాంప్రదాయ వాహనాల రెట్రోఫిట్‌మెంట్‌ను ప్రోత్సహించడం, తక్కువ లేదా సున్నా ముందస్తు ఖర్చులతో ఈవీ ఫైనాన్సింగ్ నమూనాలకు మద్దతు ఇవ్వడం, ఈవీల ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలను తెలియజేసే అవగాహన ప్రచార కార్యక్రమాలను చేపట్టడం వంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ చర్యలన్నీ కలిసి, జుఎల వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, పరిపాలన, రవాణా వ్యవస్థలు మరియు దైనందిన జీవితంలో విద్యుదీకరణను అంతర్భాగం చేయడం ద్వారా చెప్పిన మాటను ఆచరణలో పెట్టాలనే తెలంగాణ సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

## సంజీవయ్య పార్క్ సమీపంలో అధునాతన ఎక్స్‌కవేటర్ ప్రారంభం

- చెరువుల పునరుద్ధరణకు నూతన దిశ..

**బలగం టీవీ, హైదరాబాద్:**
హైదరాబాద్‌లోని పీవీ మార్గ్ వద్ద సంజీవయ్య పార్క్ సమీపంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చెరువుల పూడికతీత, కలుపు మొక్కల తొలగింపు కోసం తీసుకువచ్చిన అధునాతన ఎక్స్‌కవేటర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ ఆధునిక యంత్రం ద్వారా చెరువుల అడుగుభాగంలో పూడికతీత (డ్రెడ్జింగ్), కట్టలను బలోపేతం చేయడం, నీటి కలుపు మొక్కల తొలగింపు, శిథిలాలు మరియు బురద తొలగింపు వంటి పనులను సమర్థవంతంగా నిర్వహించవచ్చు. ముఖ్యంగా పాత చెరువుల పునరుద్ధరణలో ఇది కీలక పాత్ర పోషించనుంది.

అదేవిధంగా, కూకట్‌పల్లి నాలా మరియు నగరంలోని ఇతర సరస్సులలో నీటి కలుపు మొక్కల తొలగింపు, డ్రెడ్జింగ్ మరియు పూడికతీత పనులకు కూడా ఈ యంత్రాన్ని వినియోగించనున్నారు. పండుగల సమయంలో గణేశ్ విగ్రహ నిమజ్జనం, దుర్గమ్మ విగ్రహ నిమజ్జనం, బతుకమ్మ, ఛత్ పూజ వంటి కార్యక్రమాల నిర్వహణలో కూడా ఈ ఎక్స్‌కవేటర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి షిఫ్ట్‌కు ఒక నైపుణ్యం గల ఆపరేటర్, ఒక పాక్షిక నైపుణ్యం గల ఆపరేటర్‌తో పాటు సర్వీస్ ఇంజనీర్‌ను నియమించి యంత్రాన్ని నిర్వహించనున్నారు. నగరంలోని నీటి వనరుల సంరక్షణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా అధికారులు పేర్కొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే..

- ఎస్పీ మహేష్ బి.గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు.

సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు ఎస్పీ మహేష్ బి.గితే స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత



సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

## స్టేట్ అండ్ సెంట్రల్ ప్రభుత్వ ఉద్యోగాలపై ఉచిత అవగాహన సదస్సు విజయవంతం..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ఆర్ఆర్కే స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన స్టేట్ అండ్ సెంట్రల్ ప్రభుత్వ ఉద్యోగాలపై సోమవారం రోజున ఉచిత అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు భారీగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ నాగేంద్ర చారి హాజరై అభ్యర్థులకు విలువైన సూచనలు అందించారు. కార్యక్రమానికి హాజరైన సుమారు 200 మంది విద్యార్థులకి వివిధ ఉద్యోగాలకు సంబంధించిన ఉచిత బుక్‌లెట్ లను అందించారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలపై స్పష్టమైన అవగాహన కలిగించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగన్ గౌడ్, ఐకాన్ కోచింగ్ డైరెక్టర్ రమేష్, బాలు గౌడ్, రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగుట్ట మైనింగ్‌పై గ్రామస్థుల ఆగ్రహం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసిన ముద్విన్ ప్రజలు
- అసెంబ్లీలో అంశం లేవనెత్తాలని విజ్ఞప్తి

**బలగం టీవీ, ముద్విన్**
ముద్విన్ గ్రామానికి సమీపంలోని నల్లగుట్టలో కొనసాగుతున్న మైనింగ్ కార్యకలాపాలపై గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు, యువత, అన్ని పార్టీల నాయకులు, సర్పంచ్, ఉపసర్పంచ్ కలిసి ఎమ్మెల్యే కాసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. నల్లగుట్ట మైనింగ్ కారణంగా పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భూగర్భ జలాలు తగ్గిపోవడం, వ్యవసాయ భూములు దెబ్బతినడం, దుమ్ము మరియు శబ్ద కాలుష్యం పెరగడం వంటి సమస్యలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించి, మైనింగ్ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తి ప్రభుత్వ స్థాయిలో తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. "మన భూమి -- మన హక్కు" అనే నినాదంతో గ్రామ ప్రజలు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే



పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గ్రామ భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు.

## ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

- త్వరగా ఒప్పందం కుదుర్చుకుని దారికి రావాలి
- మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

**బలగం టీవీ, వాషింగ్టన్**
ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ఎక్మి-లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం' అని హెచ్చరించారు.

## నల్లమలలో లారీ బోల్తా

**బలగం టీవీ, నంద్యాల**
లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనతో నల్లమలలో కొద్ది సేపు ట్రాఫక్ జామ్ అయ్యింది. మండల పరిధిలోని నల్లమల అడవిలోని రహదారిపై చోటుచేసుకుంది. గిద్దలూరు నుంచి నంద్యాలకు కందుల లోడుతో వెళ్తున్న లారీ ఒక్కసారిగా నంద్యాల-మార్కాపురం జిల్లాల మధ్య ఉన్న రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఈ సమాచారం అందుకున్న మహానంది, సిరివెళ్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# మరోమారు డ్రగ్స్ కలకలం

- మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**
హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. మోకిలలో డ్రగ్స్ విక్రయిస్తున్న డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి రైల్వేశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి.. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా రైల్వే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గూగుల్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పాటూ మరో వ్యాపారవేత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు..



● **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాలోని జిల్లాలోని 13 కేజీబీవీలు, ఏడు టీజీఎంఎస్ హాస్టళ్లకు కలిపి 20 ఫ్రీజర్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవతో సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయా విద్యాలయాల బాధ్యులకు కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని విద్యాలయాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు, సేవలు అందిస్తుం దని తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు గత చలికాలంలో విద్యార్థులకు వేడి నీళ్లు అందించేందుకు ఇప్పటికే గీజర్లు అందించామని అన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఫ్రీజర్లు ఈరోజు ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్ల బాధ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ ఫ్రీజర్ల ద్వారా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, కూరగాయలు పాడైపోకుండా నిల్వ చేసుకోవచ్చునీ, పాలు, ఆకు కూరలు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు స్వచ్ఛంగా అందించే అవకాశం ఉందని అన్నారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో శుభ్రమైన ఆహారం పదార్థాలు అందించడం, వ్యర్థాల నిర్వహణ, వసతి గృహాలలో మెరుగైన జీవన వాతావరణం కల్పించడానికి ఇన్సినరేటర్, వంటపాత్రలు కూడా గతంలో అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీవో పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్, కేర్ టేకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలు త్వరగా పరిష్కరించాలి..

● **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణి అర్జీలు త్వరగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 205 అర్జీలు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేశారు.ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థుల విద్య మరియు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి..

● **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

విద్యార్థుల విద్య మరియు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, విద్యార్థులకు మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, తరగతి, వసతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులందరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని, తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

# ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లు కట్టిస్తాం..

● **ఆపన్నులకు అండగా నిలుస్తాం..**

● **ఏదైతే చెప్తామో అదే చేస్తాం.... చెప్పింది చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజం..**

● **డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్**



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో పర్యటించిన డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ రాచర్ల గొల్లపల్లిలో సీఎం చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం రాజన్నపేట, బొప్పాపూర్, పదిర గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే పేద బడుగు బలహీనవర్గాల పార్టీ అని,ఏదైతే చెప్తామో అదే చేస్తామని చెప్పింది చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజం అని అన్నారు.పదిమంది నిరుపేదలు ఆసుపత్రిపాలై అప్పుల పాలై తమ దీనస్థితిని దరఖాస్తు రూపంలో ప్రభుత్వానికి మొర పెట్టుకుంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నేరుగా లబ్ధిదారుని ఖాతాలోకి ఆసుపత్రి ఖర్చులను పంపించడం జరుగుతుందని ఆపన్నులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. సుమారు పదిమంది లబ్ధిదారులకు 3,53,500 రూపాయల విలువ గల చెక్కుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. గృహప్రవేశాలలో పాల్గొంటూ మండలంలో నిరుపేదలు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన పథకంతో సొంత జాగాలో ఇల్లు కట్టుకుంటూ ఐదు లక్షలు లబ్ధి పొంది ఇల్లు కట్టుకొని పండగ వాతావరణం లో గృహప్రవేశాలు



చేసుకుంటూ అట్టి కార్యక్రమాలకు లబ్ధిదారులు మమ్మల్ని ఆహ్వానించడమే మా పాలనకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు హామీల అమలును చూసి అసెంబ్లీలో ప్రతిపక్షం అధికార పక్షాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను గుర్తు చేస్తూ దరఖాస్తు పెట్టుకొని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు.

రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా ప్రతి కుటుంబ సభ్యుడికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,వడ్డీ లేని రుణాలు,200 యూనిట్ల వరకు గృహ విద్యుత్తు వినియోగ దారులకు ఉచిత కరెంటు,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దే అన్నారు.ప్రతి పేదవాడికి ఉపయోగపడే పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వంపై ఎంత భారం ఉన్నా సంక్షేమంలో రాజీ పడడం లేదు అన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడంలో భాగంగా రానున్న రోజుల్లో నూతన పెన్షన్ అమలు, దశల వారీగా పెన్షన్ పెంపు అంశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. ఇవన్నీ గమనిస్తున్న ప్రజలు లబ్ధి పొందుతున్న ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడుతుంటే ప్రతిపక్షాలు నివ్వెర పోతున్నాయని, భవిష్యత్తులో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు పేద ప్రజలకు చేయాల్సినవి హామీలు ఇవ్వకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సాభేరా బేగం, ఎంపీడీఓ సత్తయ్య, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సాహెబ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు చేపూరి రాజేశం, బండారి బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మెండే శ్రీనివాస్, మర్రి నారాయణరెడ్డి,యువ నాయకులు గుర్రాల రాజిరెడ్డి,గుడ్ల శ్రీనివాస్, దుంపేటి జనార్ధన్, పందిళ్ళ నారాయణ గౌడ్, పందిళ్ళ సుధాకర్ గౌడ్, ఆయా గ్రామాల నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఏకాంత సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు..

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఈ నెల 25న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం ఏకాంత సేవతో సంపూర్ణమయ్యాయని ఆలయ అర్చకులు శ్రీనివాస్ ఆచారి, వేణుగోపాల్ చారి తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పెద్ద రథంపై ప్రతిష్ఠించి నిర్వహించిన రథోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం ప్రారంభమైన రథయాత్ర మధ్యాహ్నం వరకు కొనసాగగా, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని భజనలు, సంకీర్తనలు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు వ్రత పుణ్యావచనం, హోమం, వ్రతబలి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, చక్రస్నానం, నాగవల్లి పుష్పయాగం, దేవతా ఉద్వాసన, గ్రామ బలి వంటి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ బలి కార్యక్రమం హనుమాన్ దేవాలయం వరకు నిర్వహించి పూర్తి చేశారు. తదనంతరం సప్తావరణ పూజ, ఏకాంత సేవలతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

ఆలయ కమిటీ చైర్మన్ మోతె లక్ష్మారెడ్డి, సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య ఈ వేడుకలు విజయవంతంగా నిర్వహించబడినట్లు తెలిపారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి ఘన స్వాగతం పలికారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అన్నదాన కార్యక్రమాన్ని పొన్నాల రాములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్కే సబేరా బేగం, డిప్యూటీ తహసిల్దార్ ఎలుసాని ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, నాయకులు లద్దునూరి హనుమాన్లు, షేక్ గౌస్, సిరిపురం మహేందర్, నిమ్మ సుధాకర్ రెడ్డి, లింగాల వెంకటరాజు, బలగం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదాం..

● **రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధుల పిలుపు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

బడుగు బలహీన వర్గాల ఆత్మగా భారత రాజ్యాంగం నిలుస్తుందని, దాని పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించే మూలాధారం అని పేర్కొంటూ, దాని విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతగా అభివర్ణించారు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వంటి రాజ్యాంగ సిద్ధాంతాలను కాపాడేందుకు సమిష్టి కృషి అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీన రాజ్యాంగ పరిరక్షణ వేదికను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి మేధావులు, సామాజిక కార్యకర్తలు, బహుజన సంఘాల నాయకులు, మైనారిటీ సంఘాల ప్రతినిధులు విస్తృతంగా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు బండారి బాల్‌రెడ్డి, పసుల కృష్ణ, నంది కిషన్, మెండె శ్రీనివాస్, బండి మహేందర్, కానాపురం లక్ష్మణ్, సాహెద్,



దండు శ్రీనివాస్, కంచర్ల రాజు, సింగారం దేవరాజు, ఎడ్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## సిద్ధార్థ పాఠశాలల అంతర్గత చదరంగం పోటీలకు విశేష స్పందన..

**బలగంటీవీ, కరీంనగర్:**

నగరంలోని భగత్ నగర్ సిద్ధార్థ పాఠశాలలో సిద్ధార్థ పాఠశాలల అంతర్గత చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. ఆదివారం జరిగిన పోటీలో 80 మంది విద్యార్థులు పాల్గొని వారి మేధాశక్తిని చాటారు.

ఈ సందర్భంగా సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. చదరంగం ఆటతో విద్యార్థులకు మేధాశక్తి ఏకాగ్రత పెరుగుతుందని అందుకు చదరంగం క్రీడ నేర్చుకునేటట్టు పిల్లలను చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. చదరంగం ఆటలో ఎంతోమంది కరీంనగర్ కు చెందిన విద్యార్థులు నేషనల్ మరియు ఇంటర్నేషనల్ క్రీడాకారులుగా ఉన్నారని అందుకు ప్రోత్సహిస్తున్న జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య అకాడమీ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ ను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ కరీంనగర్ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు తాటి పెల్లి సతీష్ బాబు, కంకటి సుజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ మార్క అనిల్, కోచ్ లు తరుణ్,అభిరామ్, రేవిక్, పృధ్వి, విశాల్, బి .జీవన్ , ఆర్ ,నరేన్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

# రైతుల కోసం సౌకర్యవంతమైన కూరగాయల మార్కెట్...



**బలగం టీవీ, గంభీరావుపేట:**

● **సర్పంచ్ మల్లు గారి పద్మ--నర్సయ్య గౌడ్**

రైతుల కోసం సౌకర్యవంతమైన మార్కెట్ షెడ్ ను నిర్మిస్తున్నామని గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ--నర్సయ్య గౌడ్ అన్నారు. సోమవారం గంభీరావుపేట మండల కేంద్రంలో నూతన కూరగాయల మార్కెట్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లు గారి పద్మ--నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు కూరగాయల మార్కెట్ షెడ్ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ. 10 లక్షలు, గ్రామపంచాయతీ నిధుల ద్వారా రూ. 5 లక్షలు వెచ్చించి మొత్తం రూ. 15 లక్షలతో ఈ నిర్మాణాన్ని చేపడుతున్నమని అన్నారు. మార్కెట్ నిర్మాణం పూర్తయిన తరువాత రైతులు తమ పంటలను వర్షం, ఎండ నుండి రక్షించుకుంటూ సౌకర్యవంతంగా అమ్ముకునే అవకాశం కలుగుతుందని, గ్రామంలో వ్యాపార కార్యకలాపాలు పెరుగుతాయని అన్నారు. +ఈ భూమి పూజ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టంపై హర్షం..

**టీపీసీసీ లీగల్ సెల్ నేత కడగండ్ల తిరుపతి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్, న్యాయవాది కడగండ్ల తిరుపతి రాష్ట్ర అసెంబ్లీలో 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్' బిల్లును ఆమోదించినందుకు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిన తెలంగాణ ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు, సంబంధిత ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి, అలాగే మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, కొన్ని సందర్భాల్లో హత్యలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం అందించేందుకు కృషి చేసే న్యాయవాదులు తరచూ బెదిరింపులు, దాడులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలులోకి రావడం ద్వారా న్యాయవాదులకు సమగ్ర రక్షణ లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చట్టం ద్వారా న్యాయవాదులపై దాడులు చేసే వారికి కఠిన శిక్షలు విధించే అవకాశం ఉండటం వృత్తి భద్రతకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. అదేవిధంగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని, కోర్టు పరిసరాల్లో భద్రతను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయవాదుల సంక్షేమ నిధులను పెంచడంతో పాటు, యువ న్యాయవాదులకు ప్రోత్సాహక పథకాలు అమలు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల ఐక్యతతో ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయించి, వారి గౌరవం మరియు భద్రతను కాపాడటానికి తాను కట్టుబడి ఉంటానని కడగండ్ల తిరుపతి స్పష్టం చేశారు.

## వివాహ వేడుకలో కౌన్సిలర్ కల్లూరి రేణుక-రాజు సేవా భావం..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన సందవేణి రజిత-విష్ణుప్రసాద్ దంపతుల కుమార్తె నీలిమ వివాహం సందర్భంగా 36వ వార్డు కౌన్సిలర్ కల్లూరి రేణుక-రాజు సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ 50 కిలోల బియ్యాన్ని అందించి నూతన వధువును ఆశీర్వదిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సహాయానికి వధువు కుటుంబ సభ్యులు మరియు బంధువులు ఆనందం వ్యక్తం చేస్తూ, కౌన్సిలర్ కల్లూరి రేణుక-రాజు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేష్, భాగ్యనగర్ నరేంద్ర బాబు, పురుషోత్తం, లింగంపెల్లి దేవయ్య, కుల్ల శ్రీనివాస్, కోడూరి మల్లేశం, గడ్డం శంకర్, బోయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యకారులు లేకుంటే మనమంతా లేనట్లే

- సిఎం, మంత్రులు కూడా ఉండేవారా?
- వారికిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- మండలిలో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విజ్ఞప్తి చేశారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ విజయ శాంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దాటిపోయినా.. ఇంకా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు సైతం అమలు కాలేదన్నారు. ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి గుర్తుచేశారు. ఆయా కుటుంబాలకు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ సైతం ఇచ్చామని ప్రభుత్వానికి వివరించారు. ఉద్యమకారులకు మనం తొలి ప్రాధాన్యం ఇస్తామని భరోసా కూడా ఇచ్చామని ఎమ్మెల్సీ విజయశాంతి తెలిపారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉద్యమకారులు తమను ప్రశ్నిస్తున్నారని శాసనమండలి వేదికగా ఎమ్మెల్సీ విజయశాంతి వివరించారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తి వేసి జూన్ 2వ తేదీ నాటికి వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చామని.. అది కూడా ఇంకా నెరవేరలేదని విజయశాంతి చెప్పారు. ఉద్యమకారులు లేకపోతే సీఎంలు, మంత్రులు ఉండేవారా? అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఆ బాధ్యతను కాంగ్రెస్ నెరవేరిస్తే మరో చరిత్ర అవుతుందని.. పట్టించుకోకుంటే చారిత్రక తప్పిదం అవుతుందని విజయశాంతి పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి సూచించారు

# సైబర్ నేరగాడి ట్రాప్‌లో 6లక్షలు పోగొట్టుకున్న న్యాయమూర్తి

- పోలీసులు రంగంలోకి దిగడంతో మోసగాడి అరెస్ట్

**బలగం టీవి, ముంబై**

ఒక హైకోర్టు న్యాయమూర్తి, సైబర్ నేరగాడి ట్రాప్‌లో పడ్డారు. ఆ జడ్జికి ఒక లింక్ పంపిన అతడు రూ.6 లక్షల మేర ఆయనను మోసగించాడు. న్యాయమూర్తి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చివరకు నిందితుడ్ని గుర్తించి అరెస్ట్ చేశారు. ముంబైలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 28న బాంబే హైకోర్టు న్యాయమూర్తి తన క్రెడిట్ కార్డ్ పాయింట్లను రీడీమ్ చేసుకు నేందుకు ప్రయత్నించారు. ఆ బ్యాంకు కస్టమర్ కేర్ నంబర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించగా బిజీ వల్ల లైన్ కలవలేదు. ఆ న్యాయమూర్తి బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికారు. ఒక నకిలీ నంబర్‌కు ఆయన కాల్ చేశారు. జడ్జితో మాట్లాడిన సైబర్ మోసగాడు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించాడు. ఆయనకు ఒక లింక్‌ను పంపి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. మరోవైపు ఆ న్యాయమూర్తి తన ఐఫోన్‌లో ఆ యాప్ డౌన్‌లోడ్ చేసేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆ నకిలీ టెలీకాలర్ సూచించాడు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి తన సిమ్ కార్డును ఇంటి పనిమనిషి ఆండ్రాయిడ్ ఫోన్‌లో వేసి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆ యాప్‌లో తన క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేసిన వెంటనే ఆయన ఖాతా నుంచి రూ. 6.02 లక్షలు విత్ డ్రా అయ్యాయి. కాగా, మోసపోయినట్లు గ్రహించిన ఆ బాంబే హైకోర్టు జడ్జి వెంటనే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కఫ్ పరేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జార్ఖండ్‌లోని జామ్తారాలో నివసించే 25 ఏళ్ల మజార్ ఆలం ఇస్రాయిల్ మియాన్‌ను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. జార్ఖండ్‌లోని జామ్తారా సైబర్ సెల్, కర్మతాండ్ పోలీసుల సహాయంతో పది రోజుల్లోనే నిందితుడ్ని అరెస్ట్ చేశారు. 10 రాష్ట్రాల్లో జరిగిన 36 సైబర్ మోసాల కేసులతో నిందితుడికి సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు.



# లాకర్ వస్తువులకు బీమా సౌకర్యం కుదరదు

- అందులో ఏం దాచారో బ్యాంకులు చూడవు
- లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ కుదరదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. లాకర్లలో దాచిన వస్తువులను బ్యాంకు అధికారులు చూడరని, వాటిని రికార్డు చేయరని స్పష్టం చేశారు. కాబట్టి విలువ ఆధారంగా బీమా కవరేజీ అందించడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఈ అంశాన్ని (ఃజీన్గిక్ష్మినీఝీ।సబ) లేవనెత్తగా ఆర్థిక మంత్రి దీనిపై స్పందించారు. 'లాకర్లలోని వస్తువులను బ్యాంకు సిబ్బంది తనిఖీ చేయలేరు. అలా చేయడం బ్యాంకు రూల్స్‌కి విరుద్ధం. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయి. లాకర్ వార్షిక అక్ష్మి-దదెకు 100 రెట్లు పరిహారం చెల్లిస్తున్నాయి' అని ఆమె గుర్తుచేశారు. లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీలు చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం అందించడం సాధ్యంకాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని మంత్రి తెలిపారు.

# కాళేశ్వరంతో లక్షకోట్లు ప్రజాధనం వృధా

- రాజ్యసభలో కేంద్రమంత్రి పాటిల్ వ్యాఖ్యలు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ సోమవారం రాజ్యసభలో సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ. లక్షల కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలంటూ రాజ్యసభలో కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ పైవిధంగా స్పందించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటుపై ఎన్డీఎస్ఏ నివేదికను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ నిధుల వినియోగంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రమంత్రి సి.ఆర్.పాటిల్ ధ్వజమెత్తారు. రాష్ట్రం వద్ద రూ.873 కోట్లు ఉన్నా.. మూడేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.194 కోట్లేనని ఆయన గుర్తు చేశారు. మూడేళ్లుగా ఒక్క కొత్త స్కీమ్ ప్రతిపాదన కూడా తెలంగాణ ప్రభుత్వం నుంచి రాలేదని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ పెదవి విరిచారు. మరోవైపు తెలంగాణకు చెందిన రాజ్యసభ్య సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ చే విచారణ జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# ఆటో బోల్తా: తల్లీ కుమారుడు మృతి

**బలగం టీవి, కామారెడ్డి**

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల శివారులో ఘోర ప్రమాదం జరిగింది. ఆటో బోల్తాపడిన ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా.. 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వేడుకకు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.

# ములుగు జిల్లాలో ఈదురుగాలుల వర్షం

- చెట్టుకూలి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్ జామ్

**బలగం టీవి, ములుగు**

ములుగు జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఏటూరునాగారం -తాడ్వాయి మధ్య ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. భారీ ఈదురుగాలులతో రహదారులపై చెట్లు పడిపోయాయి. దీంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. జేసీపీ సాయంతో చెట్లను తొలగించి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసారు. మరో వైపు రాష్ట్రంలోని పలు జిల్లాలకు వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. హైదరాబాద్ తో పాటు జగిత్యాల,కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, ములుగు,నాగర్ కర్నూలు, నల్గొండ,రంగారెడ్డి, సంగారెడ్డి,సిద్దిపేట,వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు,మెరుపులతో తేలికపాటి వర్షానికి చాన్స ఉంది. హైదరాబాద్ లో మార్చి 30న రాత్రి భారీ వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు ,మెరుపులతో కూడిన వర్షం పడుతుందని చెప్పింది. టోలీ చౌకీ, నాంపల్లి,మలక్ పేట, ఆసిఫ్ నగర్, కార్వాన్, గోషామహల్,మెహదీపట్నం, చార్మినార్, అత్తాపూర్ ,మసాబ్ ట్యాంక్,కూకట్ పల్లికి అలర్ట్ జారీ చేసింది. ఖైరతాబాద్,అబిడ్స్ ,సికింద్రాబాద్,ఉప్పల్, ఎల్బీనగర్, చార్మినార్ ,కంటోన్మెంట్ ,కాప్రా,మల్కాజ్ గిరిలో తేలికపాటి మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

# చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిపిన మావోయిస్టులు
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన



**బలగం టీవి, న్యూఢిల్లీ**

చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డీఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

# గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

- ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ

**బలగం టీవి, హైదరాబాద్**

గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు రెడీ చేశామని అన్నారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల డ్రాఫ్ట్ బిల్లుపై కంపెనీలతో 5 సార్లు మీటింగులు పెట్టామని...చట్టం తీసుకొస్తే కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని వివరించామన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అండగా స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు వివేక్. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు 'సామాజిక భద్రత , సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది.ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య

(యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ఎక్ష్మి-లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా.. తక్షణమే ఫిర్యాదు చేసేందుకు 'ఎక్ష్మి-లాట్‌ఫాం స్థాయి కమిటీలు' జిల్లా స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉంటుంది.

ఇంతకాలం యాప్ కంపెనీలు ఏ ప్రాతిపదికన ఆర్డర్లు ఇస్తున్నాయి, పేమెంట్లు ఎలా లెక్కిస్తున్నాయి అనే దానిపై స్పష్టత ఉండేది కాదు. ఇకపై యాప్ కంపెనీలు ఇష్టమొచ్చినట్లు రేట్లు తగ్గించడం, కార్మికులను ఇబ్బంది పెట్టడం కుదరదు. కార్మికులకు ఇచ్చే పేమెంట్లలో పారదర్శకత ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తారు.

# కేరళలో ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు

- ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఆరోపణలు

**బలగం టీవి, తిరువనంతపురం**

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీ యూడీఎఫ్‌కు, సీపీఎం-బీజేపీ కంబైన్‌కు మధ్యే జరగనుందని అన్నారు. పట్టంనాంతిట్ట జిల్లాలోని అదూర్‌లో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, కేరళలో యూడీఎఫ్ ఉండకూడదని బీజేపీ కోరుకుంటోందని, ఎందుకంటే కాంగ్రెస్‌కు మాత్రమే జాతీయ స్థాయిలో బీజేపీని సవాలు చేయగలిగే శక్తి ఉందనే విషయం వాళ్లకు బాగా తెలుసునని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో తాము సైద్ధాంతిక పోరాటం చేస్తున్నామని తెలిపారు. విపక్ష నేతలను సెంట్రల్ ఏజెన్సీలు టాక్ష్మి-గ్గక్ష్మిట్ చేస్తున్నాయని, కానీ ఎల్డీఎఫ్‌పై మాత్రం ఎలాంటి దర్యాప్తులు ఉండవని రాహుల్ విమర్శించారు. తనపై 36 కేసులు పెట్టారని, 55 గంటల సేపు నిర్వరామంగా ప్రశ్నించారని అన్నారు. కేరళ సీఎం పినరయి విజయన్‌పై మాత్రం ఎలాంటి చర్యలు లేవన్నారు. ప్రధాని మోదీ ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని, కానీ ఇటీవల పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశాన్ని లేవనెత్తడం మరిచి పోయారని రాహుల్ విమర్శించారు. శబరిమలలోని అయ్యప్ప ఆలయంతో ముడిపడి ఉన్న అంశంపై



మాట్లాడకపోవడం ద్వారా బీజేపీ, ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్టు స్పష్టమవుతోందన్నారు. యూడీఎఫ్ అధికారంలోకి వస్తే ఆలయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ఆపండి

- కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం

**బలగం టీవి, హైదరాబాద్**

అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం ఆసియా దేశాలపై తీవ్రంగా పడుతోందని.. ఆర్థిక విధ్వంసం జరుగుతోందని తెలిపారు. యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగకపోతే ప్రపంచ దేశాల భవిష్యత్తు మరింత ఆందోళనకరంగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఇప్పుడు ఆగకపోతే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఖండిస్తున్నామని.. ఆయా దేశాల మధ్య శాంతి పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. యుద్ధాన్ని ఆపే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నం చేయాలని తీర్మానం చేస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

## అనంతబాబు భార్య లక్ష్మీదుర్గకు ఊరట

**నాన్‌బెయిలబుల్ వారెట్ రద్దు చేసిన కోర్టు**

**బలగం టీవి, అమరావతి**

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గకు జిల్లా కోర్టులో ఊరట లభించింది. డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో లక్ష్మీదుర్గపై జారీ చేసిన నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్‌ను న్యాయస్థానం రద్దు చేసింది. 15 రోజులకు ఒకసారి పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని.. పాస్ పోర్ట్ స్వాధీనం చేయాలని లక్ష్మికి ఆదేశాలు జారీ చేసింది కోర్టు. ఈ సందర్భంగా డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల రక్షణపై కాకినాడ జిల్లా ఎస్పీ పర్యవేక్షణ చేయాలని ఆదేశించింది. తనపై నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్‌ను రద్దు చేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని లక్ష్మి ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఆమె అభ్యర్థనపై సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తీర్పు వెలువరించారు.అయితే, తీర్పు అనంతరం డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబం తరపు న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు కీలక విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'నాన్ బెయిలబుల్ వారెంట్ రీకాల్ చేసినంత మాత్రాన కేసు బలహీన పడినట్లు కాదు. మా న్యాయపోరాటం ఆగదు. నిందితులు తప్పించుకోలేరు, శిక్ష తప్పదు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు తిరుగుతున్నారు. నవంబర్ 30లోగా కేసు విచారణ పూర్తై తీర్పు వస్తుంది. నాన్ బెయిలబుల్ వారెంట్ రద్దు తప్పుడు సంకేతాలు తీసుకువెళ్తుంది. హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గ పాత్రపై ఆధారాలు ఉన్నాయని తెలిపారు.

# పెరంబూర్ నుంచి విజయ్ నామినేషన్

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- డిఎంకె పాలనలో ప్రజలకు రక్షణ లేదని విమర్శలు
- 404 కోట్ల స్థిరచరాస్థులు ఉన్నట్లు అఫిడవిట్ దాఖలు

**బలగం టీవి, చెన్నై**

తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీకి సోమవారంనాడు నామినేషన్ వేశారు. తూర్పు తిరుచ్చి నుంచి కూడా ఆయన పోటీలో ఉన్నారు. పెరంబూర్‌లో నామినేషన్ వేసేందుకు వచ్చిన విజయ్‌ను చూసేందుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున అక్కడకు వచ్చారు. నామినేషన్ అనంతరం పెరంబూర్‌లో ఓపెన్ టాప్ వాహనంలో ప్రచారం సాగించారు. డీఎంకే ఒక దుష్టశక్తి అని మరోసారి విజయ్ విమర్శించారు. డీఎంకే హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మాదకద్రవ్యాల బెడద ఉందని ఉన్నారు. ఈ దుస్థితికి దుష్టశక్తి డీఎంకే, స్టాలిన్ కారణమని విమర్శించారు. తమిళనాడును తాము కాపాడతామని, సాఫీగా తన జీవితం సాగుతున్నప్పటికీ ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజాసేవతో వారి రుణం తీర్చుకుంటున్నానని చెప్పారు.

ప్రజలకు తాను అబద్ధాలు చెప్పనని, వంచనకు పాల్పడనని విజయ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల వాడకాలతో హింసాత్మక దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. డీఎంకే దుష్టశక్తి పాలనలో భద్రత ఉందా? మీ పిల్లలు క్షేమంగా ఉండగలరా? మీరు ప్రశాంతంగా బతకగలరా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని లిక్కర్ కార్పొరేషన్ టీఏఎస్ఎంఏసీలో రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వంలో భద్రత కానీ, ఉపాధి కానీ లేదని, టీవీకే 'విజిల్' గట్టిగా ఊది డీఎంకేను ఈ ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇకపోతే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేస్తున్న టీవీకే అధినేత విజయ్ జోసెఫ్ తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. పెరంబూర్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో

పొందుపరిచారు. మొత్తం రూ.404.58 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు డిపాజిట్లు, స్థిరాస్తులు, వాహనాలు వంటి ఇతర వివరాలనూ పొందుపరిచారు. నగదు



రూపంలో తన వద్ద రూ.2 లక్షలు, భార్య సంగీత వద్ద రూ.1 లక్ష ఉన్నట్లు విజయ్ తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో రూ.213 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్‌క్ష్మిర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మారుతీ సుజుకీ స్విఫ్ట్, టీవీఎస్ ఎక్స్‌ఎల్ సూపర్ కూడా ఉన్నట్లు విజయ్ పేర్కొనడం గమనార్హం. వాహనాల మొత్తం విలువ రూ.14.35 కోట్లుగా పేర్కొన్నారు. తన వద్ద 883 గ్రాముల బంగారం విలువ ఉందని, దాని విలువ సుమారు రూ.1.20 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. రూ.15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా రూ.198 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు విజయ్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో కొన్ని సొంతంగా కొనుగోలు చేసినవి కాగా.. మరికొన్ని వారసత్వంగా సంక్రమించినవి ఉన్నాయి. భార్య సంగీత పేరు మీద రూ.15 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. తనకు అప్పులు ఏవీ లేవని తెలిపారు. స్వయం ఉపాధి, వడ్డీ, ఆస్తుల నుంచి వచ్చే అక్ష్మి-దదె ఆదాయాలను తన ప్రధాన ఆదాయ వనరులుగా పేర్కొన్నారు. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# రాజస్థాన్ రాయల్స్ శుభారంభం



- 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సునామీ హాఫ్ సెంచరీ
- సీఎస్‌కేపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఘన విజయం సాధించింది. సోమవారం గౌహతి వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను 8 వికెట్ల తేడాతో ఓడించింది.

మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 19.4 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. జెమీ ఓవర్టన్ 43 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, నండ్రే బర్గర్, రవీంద్ర జడేజా రెండేసి వికెట్లు తీసి సీఎస్‌కేను కట్టడి చేశారు.

అనంతరం లక్ష్య ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ కేవలం 12.1 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసి సునాయాస విజయాన్ని అందుకుంది. 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కేవలం 17 బంతుల్లోనే 52 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతని ఇన్నింగ్స్‌లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు ఉన్నాయి. యశస్వి జైస్వాల్ 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్ పవర్‌ప్లేలోనే సీఎస్‌కే నాలుగు వికెట్లు కోల్పోవడమే అయ్యింది. వర్షం కారణంగా పిచ్ బౌలర్లకు అనుకూలంగా మారగా, పరిస్థితులను అంచనా వేయకుండా ఆడిన సీఎస్‌కే బ్యాటర్లు వరుసగా ఔటయ్యారు.వైభవ్ సూర్యవంశీ ఇచ్చిన క్యాచ్‌ను ప్రారంభంలోనే వదిలేయడం సీఎస్‌కేకు భారీగా నష్టమైంది. ఆ అవకాశాన్ని వినియోగించుకున్న అతను కేవలం 15 బంతుల్లో హాఫ్ సెంచరీ నమోదు చేసి మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు మలిచాడు.

# బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపాలి

- వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌పై శ్రీకాంత్ పెదవి విరుపు

**బలగం టీవీ, హైదరాబాద్**



టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గత కొంత కాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. టీ20 ప్రపంచ కప్ 2026 ఆదిలో అద్భుతంగా బౌలింగ్ వేసిన వరుణ్.. క్రమంగా గతి తప్పి భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. ఐపీఎల్‌లోనూ అదే రీతి కొనసాగుతోంది. కేకేఆర్ తరపున ప్రాతినిధ్యం వహిస్తోన్న అతడు.. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి 48 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. దీంతో అతడి బౌలింగ్ శైలిపై టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు.

'బంతిని విభిన్నంగా వేయడం, లెగ్ స్పిన్ సంధించడాన్ని నేర్చుకోనంత వరకు వరుణ్ చక్రవర్తి ఇబ్బందిపడుతూనే ఉంటాడు. ఎప్పుడూ గూగ్లీలు వేయడం వర్కౌట్ అవ్వదు. బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపించాలి. కొన్నిసార్లు లెగ్ స్పిన్ వేయాలి. ఇప్పుడైతే అతడి బౌలింగ్‌లో ఎలాంటి మిస్టరీ లేదు. అదంతా హిస్టరీగా మారిపోయింది. బ్యాటర్లకు కాస్త దూరంగా బంతిని విసరాలి. అప్పుడు షాట్లు కొట్టేందుకు ప్రయత్నించి వికెట్లు ఇస్తారు. దీంతో తర్వాత వచ్చే బ్యాటర్లు కాస్త జంకుతారు. ఇక్కడ ఆయా జట్ల సారథులకూ ఓ మాట చెబుతున్నా. ఇప్పుడు వరుణ్‌కు పవర్ ప్లేలో బౌలింగ్ ఇవ్వొద్దు. ముంబైతో మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఇలానే వరుణ్ వేసిన తొలి ఓవర్లో దూకుడుగా పరుగులు రాబట్టాడు. దాంతో వరుణ్ ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది' అని క్రిష్ శ్రీకాంత్ వెల్లడించాడు.



## తేలిపోయిన సంజూ శాంసన్

- చెన్నై జట్టులో నిరాశ పర్చిన సంజూ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్‌లో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ కు ఆడుతున్న సంజూ శాంసన్ మొదటి మ్యాచ్‌లో తేలిపోయాడు. ఎన్నో అంచనాల మధ్య పసుపు జెర్సీతో క్రీజులోకి వచ్చిన సంజూ.. రెండో ఓవర్లోన క్లీన్‌బౌల్డయ్యాడు. నండ్రె బర్గర్ వేసిన ఆ ఓవర్లో చివరి బంతికి డిఫెన్స్ ఆడాలనుకున్న శాంసన్ అంచనా తప్పగా.. బంతి మెరుపు వేగంతో ఆఫ్ స్టంప్‌ను ఎగరగొట్టింది. కోట్లాదిమంది అభిమానగణమున్న సీఎస్కే తరపున సంజూ శాంసన్ అరంగేట్రం అదరలేదు. సిక్సర్లతో హోరెత్తిస్తాడని ఆశించిన అభిమానులను నిరాశపరుస్తూ ఆరు పరుగులకే ఔటయ్యాడీ హిట్టర్. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూను నండ్రె బర్గర్ బౌల్డ్ చేశాడు. డిఫెన్స్ ఆడాలనుకున్న అతడి అంచనా తప్పగా బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. తమ మాజీ కెప్టెన్ వికెట్ తీసిన సంతోషంలో బర్గర్ గాల్లోకి ఎగరగా.. సీఎస్కే అభిమానులు 'అయ్యో' అని తలపట్టుకున్నారు.

# అత్తాపూర్‌లో దారుణం.. మతిస్థిమితం లేని యువతిపై లైంగికదాడి

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఒక దారుణ ఘటన ఇప్పుడు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తోంది. కనీసం తనపై జరుగుతున్న దాడిని కూడా అర్థం చేసుకోలేని, తన గోడును ఎవరికీ చెప్పుకోలేని ఒక మతిస్థిమితం లేని యువతిపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం

రేపుతోంది.అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్ నగర్‌లోని మతిస్థిమితం సరిగ్గా లేని ఒక యువతిపై ఈ అఘాయిత్యం జరిగింది. యువతి ఒంటరిగా ఉన్నది గమనించిన ఒక యువకుడు ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడ నుంచి పారిపోయాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు యువతి పరిస్థితి గమనించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిదింతుడు అదే ప్రాంతానికి చెందిన అఖిల్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల కోసం యువతిని ఆస్పత్రికి తరలించారు.





## హైదరాబాద్‌లో భారీ గ్యాస్ సిలిండర్ రాకెట్ ఛేదన

**414 సిలిండర్లు స్వాధీనం -- 10 మంది అరెస్ట్ -- బ్లాక్ మార్కెట్ దందాపై పోలీసులు కఠిన చర్యలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు ఛేదించారు. బంజారాహిల్స్ పరిధిలోని ఓ శ్మశాన వాటికలో అక్రమంగా నిల్వ ఉంచిన 414 ఎల్పీజీ సిలిండర్లను స్వాధీనం చేసుకుని 10 మందిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా సోమవారం ఈ ఆపరేషన్ నిర్వహించారు. గల్ఫ్ యుద్ధం కారణంగా ఏర్పడిన ఎల్పీజీ కొరతను ఆసరాగా చేసుకుని నిందితులు సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మాట్లాడుతూ, నిందితులు అధిక లాభాల కోసం ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారని తెలిపారు. వారి నుంచి 11 రవాణా వాహనాలతో కలిపి మొత్తం రూ.21.88 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల కథనం ప్రకారం, శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ ఏజెన్సీ' నిర్వహిస్తున్న మహ్మద్ అమీర్ ఈ రాకెట్‌కు ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. బంజారాహిల్స్‌లోని నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలోని శ్మశానంలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచి అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. అరెస్టైన వారిలో గ్యాస్ ఏజెన్సీ యజమాని, డెలివరీ బాయ్స్, డ్రైవర్లు, కార్మికులు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో వివిధ బరువుల గ్యాస్ సిలిండర్లు, డీసీఎం వాహనాలు, బొలెరోలు, ఆటోలు ఉన్నాయి. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కుల వ్యవస్థను రద్దు చేయండి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ

**బలగం టీవీ, హైదరాబాద్**

దళితులు క్రిస్టియన్‌గా మారితే వారి ఎస్సీ హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము ఖరిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. కుల వివక్షతను రూపుమాపడం చేతకానప్పుడు ఎస్సీ హోదాను రద్దు చేయడం కాకుండా కుల వ్యవస్థనే పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీల మత స్వేచ్ఛను హరించే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని, అవి వివక్షతకు ప్రతిరూపమని పేర్కొన్నారు.సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసీ, బీసీ క్రైస్తవులకు లేని నిబంధనలు ఎస్సీలకు మాత్రమే ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 25లకు విరుద్ధమన్నారు. దళితులపై మతపరమైన ఆంక్షలు విధించడం అన్యాయమని, వారు ఏ మతాన్ని అనుసరించాలి, ఎలా జీవించాలి అన్నది నిర్ణయించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. దళితులను తక్కువగా చూడడం ఇకపై సహించబోమన్నారు. దళితులు గొర్రెలు అనుకుంటున్నారా ? ఇకపై ఆ ఆటలు చెల్లవని, గాంధీ, గాంధీ అనుచరుల కుట్రల వల్ల దళిత క్రైస్తవులు హక్కులు కోల్పోయారని తెలిపారు. హిందూ దేవాలయాలు అందరివైనప్పుడు బ్రాహ్మణులు మాత్రమే పూజారులుగా ఎందుకుండాలనీ అయోధ్య మొదలుకొని అన్ని దేవాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను పూజారులుగా నియమించాలనీ ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరారు. క్రైస్తవ మతంలోకి మారిన అగ్రకులాల సామాజిక హోదా మారకపోతే, దళితుల ఎస్సీ హోదా ఎందుకు మారాలని ప్రశ్నించారు.

## రాజకీయ ఆరోపణల వేదికగా అసెంబ్లీ

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదనీ, ప్రభుత్వం సభ హుందాతనాన్ని దిగజారుస్తోందని బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందనీ, ఘోష్ కమిటీ నివేదిక ఆధారంగానే సీబీఐ విచారణ కోరుతున్నామని స్పష్టం చేశారు. 'ఘోష్ కమిటీ నివేదికను ఇంతవరకు బయటపెట్టకుండా సీబీఐ విచారణ ఎలా కోరతారు? ప్రాజెక్టులో ఎస్టిమేషన్లు, అప్రూవల్స్, పనుల్లో భారీ తప్పులు జరిగాయి' అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన 'మెగా ఇంజనీరింగ్' సంస్థకు మళ్లీ 'మన ఊరు–మన బడి' పథకంలో పనులు అప్పగించడం ఏంటని ప్రశ్నించారు. ప్రధాని మోడీ, అమిత్ షా గతంలో కాళేశ్వరాన్ని గత ప్రభుత్వానికి ఏటీఎం అని అన్నారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీని ఏ విధంగా నడిపిందో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమూ అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. సభలో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదనీ, మిత్ర పక్షాలకు గంటల కొద్దీ సమయం ఇస్తూ, ప్రతిపక్షాలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారిని బీఆర్ఎస్ సభ్యునిగా స్పీకర్ గుర్తించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా' అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తీవ్రమైన సమస్యలు ఉన్నా, వాటిని పక్కన పెట్టి అసెంబ్లీని కేవలం రాజకీయ ఆరోపణల వేదికగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, పోలీసుల సరెండర్ బిల్లులు, టీఏలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందనీ, రిటైర్డ్ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను ఎలా పోషించుకోవాలి? అని ప్రశ్నించారు. యువతకు కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని, కేవలం గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. మైనింగ్ అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తే, దర్యాప్తును నీరుగార్చడానికి సీబీసీఐడీకి అప్పగిస్తామని తప్పించుకుం టున్నారని మండిపడ్డారు. 'అసెంబ్లీలో 'నువ్వు దొంగ అంటే, నువ్వు దొంగ' అని తిట్టుకోవడం తప్ప, సమస్యల పరిష్కారంపై సోయి లేదు. ప్రజలను బోల్తా కొట్టించి మళ్లీ అధికారంలోకి రావాలనే తప్ప, ప్రజా ప్రయోజనాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు' అని విమర్శించారు.

## మంత్రిపై బీఆర్ఎస్ కక్ష

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు,

అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు అనుసరిస్తున్న తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అద్భుతమైన పాలనను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తూ సభా సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. మచ్చలేని నాయకుడిగా పేరున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు కక్షగట్టి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి తమ వ్యక్తిగత పనులు చేయలేదన్న అక్కసుతో, రాజకీయ లబ్ధి కోసం ఆయనపై లేనిపోని నిందలు వేస్తున్నారని విమర్శించారు. మంత్రి ప్రతిష్టను దిగజార్చడానికి వారు చేస్తున్న ప్రయత్నాలు ప్రజల ముందు ఏమాత్రం నిలవవని స్పష్టం చేశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన మైనింగ్, సాండ్ మాఫియా అక్రమాలపై ప్రభుత్వం సీబీ–సీఐడీ విచారణకు ఆదేశిస్తే, బీఆర్ఎస్ నేతలు భయపడి సభను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌కు గట్టిగా బుద్ధి చెప్పారనీ, అయినాసరే వారి పద్ధతిలో మార్పు రావడం లేదని ఎద్దేవా చేశారు. సభలో బీఆర్ఎస్ సభ్యులు చిల్లరగా వ్యవహరిస్తున్నా, సదరు పార్టీ సీనియర్ నాయకులు హరీష్ రావు వారిని కనీసం అడ్డుకోకపోవడం వారి రాజకీయ సంస్కృతిని తెలియజేస్తుందని విమర్శించారు. పద్దులపై చర్చ జరగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ సభ్యులు ప్రవర్తిస్తున్నారని, ప్రజా ప్రభుత్వంపై బురద జల్లడం మానుకుని, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే హితవు పలికారు. ప్రజలు కాంగ్రెస్ పాలనకు బ్రహ్మరథం పడుతున్నారనీ, ప్రతిపక్షాల అసత్య ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.



## వివాదంలో ఫుట్‌బాల్ ఫెడరేషన్ చీఫ్ కల్యాణ్ చౌబే

- వేధింపు ఆరోపణలు చేసిన మహిళల ఫుట్‌బాల్ కమిటీ ఛైర్మన్ వాలంకా

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ చీఫ్ కల్యాణ్ చౌబేపై వివాదంలో చిక్కుకున్నారు. ఆయనపై ఏఐఎఫ్ఎఫ్ మహిళల ఫుట్‌బాల్ కమిటీ ఛైర్మన్ వాలంకా అలెమావో వేధింపుల ఆరోపణలు చేశారు. మార్చి 29న దిల్లీలోని ఫుట్‌బాల్ హౌస్‌లో జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. తనను సీనియర్ అధికారులు హేళన చేశారని, వేధించారని ఆరోపించారు. భారత మహిళల ఆసియా కప్ క్యాంపెయిన్‌లో భాగంగా పాలనాపరమైన లోపాలను ఇటీవల ఆమె ఎత్తిచూపిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం.

చౌబే, ఇతర సీనియర్ అధికారుల చర్యలను ప్రస్తావిస్తూ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కు అలెమావో లేఖ రాశారు. 'చౌబే, ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.హారిస్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.సత్యనారాయన్ ప్రవర్తనను మీ ముందు ఉంచాలనుకుంటున్నాను. నా గొంతు అణచివేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి.

అధ్యక్షుడు నాతో అగౌరవంగా ప్రవర్తించారు. ఆయనతో కలిసి మిగిలినవారు స్వరం పెంచి, బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. సమావేశం జరుగుతున్నంతసేపు నన్ను టార్గెట్ చేశారని ఆమె ఆరోపించారు. ఇండియా ఫుట్‌బాల్ పాలకవర్గంలో వాలంకా కీలక వ్యక్తి. చర్చిల్ బ్రదర్స్ ఫుట్‌బాల్ క్లబ్ గోవాకు ఆమె సీఈఓగా ఉన్నారు. ఆమె తండ్రి చర్చిల్ అలెమావో గోవా ముఖ్యమంత్రిగా పని చేశారు. కొన్నేళ్లపాటు ఆ క్లబ్‌ను నడిపించారు. ఫిఫా మహిళల ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన తొలి భారతీయురాలీమె. 2025 నుంచి 2029 వరకు ఆ హోదాలో కొనసాగుతారు.

## పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుని నిషేధించాలి

- తీర్మానం ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుని నిషేధించాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. రైతులు వ్యవసాయానికి వాడుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ ప్రమాదకరంగా మారిందని.. అందుకే తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సభ్యులకు మంత్రి వివరించారు. ఇది ప్రాణాంతక రసాయనమని.. దీన్ని అనేక దేశాల్లో నిషేధించారని తెలిపారు. పారాక్వాట్ డైక్లోరైడ్ వాడడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలతో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వాడి అనేక మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ లక్ష్యాలకు ఇది అడ్డుగా మారిందని.. దీని తయారీ, వాడకం, రవాణా, దిగుమతి ఇలా అన్ని విధాలుగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గడ్డి మందుని నిషేధించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేశారు. ఇటీవలే నడుగు రాహుల్ రామకృష్ణ సోదరుడు దీనికి బలయ్యారు.

## గ్యాస్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించేది లేదనీ, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గృహ అవసరాలకు వాడే సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా గ్యాస్ వాడుతున్న వారిపై 435 కేసులు నమోదు చేసి, 800 సిలిండర్లను సీజ్ చేసినట్టు వెల్లడించారు.

గ్యాస్ సరఫరా నిరంతరం అందుబాటులో ఉందనీ, ప్రజలు ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని కలెక్టర్ కోరారు. గ్యాస్ సంబంధిత సమస్యలు లేదా అక్రమాలపై ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 180042500333/1967 లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 7416687878కు సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, జితేందర్ రెడ్డి, డీఆర్వో ఈ. వెంకటాచారి, సివిల్ సప్లై అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మౌనిక శరీర భాగాలు స్వాధీనం

**సీన్ ర ఈకన్‌స్టక్షన్‌లో రవీంద్రపై స్థానికుల దాడి**

**బలగం టీవీ, హైదరాబాద్**

విశాఖ గాజువాక హత్య కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. డబ్బుల కోసం ప్రియురాలు వేధిస్తోందని మౌనిక అనే మహిళను నిందితుడు రవీంద్ర అత్యంత దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి సగం ఫ్రిజ్‌లో మిగతా భాగం మూట కట్టి ఇంట్లోనే ఓ మూలన పెట్టాడు. అనంతరం పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోయాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా రెండు తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఘటనపై పోలీసులు, క్లూస్ , ఫోరెన్సిక్ టీమ్‌లు వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు రవీంద్ర ఇంటినుంచి శరీర భాగాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టమ్‌కు పంపారు. సంచులు, కత్తులను కూడా స్వాధీనం చేస్తున్నారు. అయితే, ఈ కేసులో తాజాగా మరో కీలక ట్విస్ట్ చోటు చేసుకుంది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసేందుకు ఘటనా స్థలానికి నిందితుడు రవీంద్రను పోలీసులు తీసుకెళ్లారు. అక్కడే ఉన్న మౌనిక కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహానికి గురయ్యారు. పోలీసుల అదుపులో ఉన్నా అతనిపై దాడికి పాల్పడ్డారు. స్థానిక అపార్ట్మ–టంక్మి–మెంట్ వాసులు సైతం రవీంద్రపై దాడి చేశారు. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు వారిని నిలువరించేందుకు ప్రయత్నించినా బాధితులు ఆవేదనతో రెచ్చిపోయారు. చివరికి పోలీసులు సర్దిచెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. రవీంద్రను కఠినంగా శిక్షించాలని, మౌనికకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా పోలీసులను మౌనిక తరపు బంధువులు వేడుకున్నారు.

## బంగారు గని వద్ద దాడి

- 70మంది మృత్యువాత

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

దక్షిణ సూడాన్ మరోసారి మృత్యుఘోషతో విలవిలలాడిపయింది. రాజధాని జుటా శివార్లలోని ఓ బంగారు గని వద్ద తలెత్తిన వివాదంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపగా.. 70 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 'ఓ బంగారు గనిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో 70 మందికిపైగా మరణించారు. అనేక మంది గాయపడ్డారు' అని పోలీసులు తెలిపారు. దక్షిణ సూడాన్ ప్రతిపక్ష పార్టీ 'సూడన్ పీపుల్స్ లిబరేషన్ మూవ్‌మెంట్ ఇన్ అపోజిషన్' ఈ దాడిని ఖండించింది. ప్రభుత్వ బలగాలే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాయని ఆరోపించింది.

## అమెరికాకు స్పెయిన్ షాక్

**గగనతలంలో విమానాలకు అనుమతి నిరాకరణ**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలు పంచుకొనే విమానాలను అనుమతించమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ సోమవారం వెల్లడించారు. ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరించింది. 'ఇరాన్ యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల కోసం మిలిటరీ స్థావరాలు లేక గగనతలాన్ని వియోగించడానికి అనుమతి ఇవ్వబోం. ఏక పక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగానే తాజా ప్రకటన వచ్చింది' అని రక్షణ, ఆర్థిక మంత్రులు స్థానిక మీడియాలో వెల్లడించారు.

## మూలపోర్టు పట్ల కూటమి నిర్లక్ష్యం

**మాజీమంత్రి బొత్స విమర్శలు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

కూటమి నేతలు స్వార్థంతో వ్యవహరిస్తున్నారని వైసిపి మాజీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. వైసిపి హయాంలో నాలుగు పోర్టుల నిర్మాణం చేపట్టామని, ప్రభుత్వానికి కనువిప్పు కలగాలనే ఈ సభ పెట్టామని అన్నారు. ఈ సందర్భంగా నౌపాడ, శ్రీకాకుళం జిల్లా లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూలాపేట పోర్టు రాష్ట్ర అభివృద్ధికి కీలమని, వలసలు నివారించేందుకే మూలాపేట పోర్టును మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి నిర్మించారని, తమ హయాంలోనే 70 శాతం పోర్టు నిర్మాణం జరిగిందని బొత్స తెలియజేశారు. జగన్ కు క్రెడిట్ వస్తుందనే పనులు నిలిపివేయడం దారుణమని విమర్శించారు. రైతులకు కనీసం ఇన్ ఫుట్ సబ్సిడీ ఇవ్వడం లేదని, పేరుకే సూపర్ హిట్, ఒక్క పేదవాడికి న్యాయం జరగలేదని మండిపడ్డారు. పోర్టు చూస్తామంటే టిడిపికేంటి

బాధ టిడిపి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటీ? అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వాన్ని ఎందుకు ఆపుతున్నారు? భయంతో ఎన్నాళ్లు పాలిస్తారు? అని ప్రశ్నించారు. విశాఖకు డేటా సెంటర్ ను ఎవరు తెచ్చారో అదానే చెప్పారని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

balagamtv100@gmail.com

# చిరుతో మరోమారు బాబీ సినిమా



మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించేం దుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో 'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.సినిమా కాస్టింగ్ విషయంలో కూడా ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. మెగాస్టార్‌కు భార్య పాత్రలో నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి నటించనున్నట్లు తెలుస్తోంది. కూతురు పాత్రలో 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ ఎంపికైనట్లు సమాచారం.

# రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'..

## దరుంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము'సగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు.



కళ్లెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్




చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

# సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.



# ఓటిటిలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని




శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేదని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.

# ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం



విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబం ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలని సినీ వర్గాలు, అభిమానులు కోరుకుంటున్నారు.